అందరి సహకారంతో సీఎం సభ విజయవంతం : ఆది శ్రీనివాస్



విశ్వంభర, రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరైన భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో ఇందిరమ్మ చీరల బిల్లుల కింద రూ. 141.48 కోట్లు విడుదలైన సందర్భంగా పాలిస్టర్, మ్యాక్స్ అసోసియేషన్, చేనేత వస్త్ర వ్యాపారులు, ఆసాముల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు ప్రజల నుంచి లభించిన స్పందన తమలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ఈ ప్రోత్సాహంతో ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా సిరిసిల్లలో ప్రజలు చూపిన స్పందన ప్రత్యేకంగా నిలిచిందన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు సభకు తరలివచ్చారని తెలిపారు. వేములవాడ, కొడురుపాకతో పాటు పరిసర ప్రాంతాల్లో సభకు వచ్చిన వాహనాలతో భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడిందన్నారు. రాజన్న సిరిసిల్లతో పాటు కామారెడ్డి, సిద్దిపేట, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలు, బాల్కొండ, వేములవాడ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారని తెలిపారు. సీఎం పాదయాత్రలో పాల్గొనాలనే ఆకాంక్షతోనూ పలువురు ప్రజలు హాజరయ్యారని పేర్కొన్నారు.

నేతన్నలు, కార్మికుల సహకారం అభినందనీయం..

సిరిసిల్ల అంటేనే నేతన్నల శ్రమ, కష్టానికి ప్రతీక అని ఆది శ్రీనివాస్ అన్నారు. సీఎం సభ విజయవంతానికి నేతన్నలు, పవర్‌లూమ్ సంఘాల ప్రతినిధులు, ఆసాములు, కార్మికులు, యాజమాన్య ప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. సభ ఏర్పాట్లపై వారితో సమావేశాలు నిర్వహించి సమన్వయం చేసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేశారని అన్నారు. సభకు వచ్చిన ప్రజలను సురక్షితంగా వారి గ్రామాలకు చేర్చే వరకు బాధ్యతగా వ్యవహరించిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. సుమారు లక్షన్నర మందిని సభకు ఆహ్వానించగా, అంతకుమించి ప్రజలు తరలివచ్చారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన, సభ ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ నేతన్నలు, కార్మికులు, రైతులు, ఇతర వర్గాల సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామని తెలిపారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధికి సమష్టి కృషితో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

సేల్స్‌ఫోర్స్‌తో కేఎల్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం



విశ్వంభర, హైదరాబాద్: సీఆర్ఎం, కృత్రిమ మేధ ఆధారిత సాంకేతిక సంస్థ సేల్స్‌ఫోర్స్‌తో కేఎల్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయంలో 'టేబ్లో ల్యాబ్'ను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల్లో డేటాపై అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచనా విధానం, కృత్రిమ మేధ నైపుణ్యాలను అభివృద్ధిచేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని విశ్వవిద్యాలయం తెలిపింది. టేబ్లో ద్వారా విద్యార్థులకు డేటాను విశ్లేషించి అవసరమైన నిర్ణయాలు తీసుకునే విధానంపై ప్రత్యక్ష అనుభవం కల్పించనున్నారు. వ్యాపార సంస్థలు డేటా, అంతర్దృష్టులు, కృత్రిమ మేధను ఉపయోగించి నిర్ణయాలు ఎలా తీసుకుంటాయో విద్యార్థులు తెలుసుకునేలా ఈ ల్యాబ్‌లో శిక్షణ అందించనున్నారు. డేటా దృశ్యీకరణతో పాటు అధునిక విశ్లేషణ పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



విశ్వంభర, చింతపల్లి: వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన ఘటన చింతపల్లి మండలంలోని నెల్వలపల్లి గ్రామంలో జరిగింది . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్వలపల్లి గ్రామానికి చెందిన రైతు గజ్జల మల్లారెడ్డి (40) సెప్టెంబర్ 30న మధ్యాహ్నం సమయంలో తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు చేతులకు తగిలాయి. దీంతో ఆయన తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే మల్లారెడ్డిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి సుమారు 11 గంటల సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య గజ్జల రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ముత్యాల రాంమూర్తి తెలిపారు. ఈ ఘటనతో నెల్వలపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంగాపూర్‌కు రూ.60 లక్షలతో రోడ్డు మంజూరు

విశ్వంభర, పెద్దశంకరంపేట: నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామ అభివృద్ధికి రూ. 60 లక్షలతో రోడ్డు మంజూరైందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ. 10 లక్షలతో కల్వర్టులు, రూ. 4 లక్షలతో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మెయిన్ రోడ్డు నుంచి గంగాపూర్ వరకు మంజూరైన రూ. 60 లక్షల రహదారి పనులకు త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. గంగాపూర్ నుంచి అబ్బెంద వరకు రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వృద్ధులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: వృద్ధుల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 21 గ్రామీణ మండలాల నుంచి 250 మంది వృద్ధ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరయ్యారు. ముందుగా మెగా వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్, థైరాయిడ్, లివర్, కిడ్నీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను సంరక్షించడం పిల్లల బాధ్యతని, వేధింపులకు గురైతే చట్టపరంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఆస్తులను తొందరపడి ఇతరుల పేర్లపై బదలాయించవద్దని సూచించారు. పీడీ డీఆర్డీఏ శ్రీలత మాట్లాడుతూ, అర్హులకు ప్రతినెలా సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని, కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు, వైద్య, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్నేనిగూడెంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సర్నేనిగూడెం గ్రామంలో గురువారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి పాల్గొని గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, అంగన్‌వాడీ కేంద్రంలోని వంటగది తోటను, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన వీబీజీ రామ్‌జీ పనులను కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ. రాములు, ఏపీఓ వెంకన్న, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నలుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను స్థానిక సర్పంచ్ ఏర్పుల వెంకటేశం పంపిణీ చేశారు. తోటకూరి నర్సింహకు రూ. 24 వేలు, చంద్రగిరి మత్స్యగిరికి రూ. 60 వేలు, పోలేబోయిన గంగయ్యకు రూ. 26 వేలు, ఎలగందుల సుదర్శన్‌కు రూ. 37 వేల చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను సర్పంచ్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబటి సాయికుమార్, వార్డు సభ్యులు కాడిగళ్ల రామనర్సింహ, ఏర్పుల పద్మ యాదయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు, షేక్ రసూల్, నెబోయిన నర్సింహ, కోలగాని యాదయ్య, కాడిగళ్ల రవి, ఇంజమూరి నాగేష్, కాడిగళ్ల లింగయ్య, ఇంజమూరి నర్సింహ, దొంతి రమేష్, పులిపలుపుల శంకరయ్య, గోనె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



విశ్వంభర, పెద్ద శంకరంపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు . నగల్ గిద్ద మండల పరిధిలోని కారముంగి గ్రామంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పలు అభివృద్ధి పనులను నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ. 10 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, అలాగే మరో రూ. 10 లక్షలతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కారముంగి గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను కూడా దశలవారీగా చేపట్టి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శోభనాద్రిపురంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామంలో గురువారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాథ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శ్రమదానం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, వీబీజీ రామ్‌జీ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



విశ్వంభర, పెద్దశంకరంపేట: నారాయణఖేడ్ నియోజకవర్గంలో భవిష్యత్తులో సాగు, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. గురువారం మానూర్ మండలం బోరంచ గ్రామంలోని సింగూర్ ప్రాజెక్టు బ్యాక వాటర్ నీటి నిల్వలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల లభ్యత, ప్రస్తుత నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి నిల్వల పరిస్థితిని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అధికార యంత్రాంగం సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ రామచందర్‌నాయక్, ఎస్ఈ రఘువీర్, ఈఈ నాగభూషణం, డీఈ బాలకృష్ణ, ఏఈ సాయికిషోర్, నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజి నీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఆరోగ్య లక్ష్మి పథకాన్ని అర్హులైన వాళ్లందరూ సద్వినియోగం చేసుకోవాలి



విశ్వంభర, కనగల్: పోషణ మాసంలో భాగంగా బుడుమర్లపల్లి, కనగల్లు గర్భిణీలు బాలింతలు పిల్లలు పోషకాహారం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల అన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.పోషణ మాసంలో భాగంగా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకాన్ని అర్హులైన వాళ్లందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజు మన గ్రామంలో సహజంగా లభించే మునగాకు, కరివేపాకు, తోటకూర లాంటి ఆకుకూరలు కూరగాయలు నిత్యం ఆహారంలో తినడం ద్వారా రక్తహీనతను రాకుండా కాపాడుకోవచ్చు అని తెలిపారు. గర్భిణీ అని నిర్ధారణ అయినప్పటి నుండి రెండు సంవత్సరాల పిల్లల వరకు 1000 రోజులు చాలా ప్రాముఖ్యనీ వివరించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు, అంగన్వాడి టీచర్ రాజ్యం, హెల్పర్ ,సంఘ బంధం వి బి కేలు పాల్గొన్నారు

ఇంటిమేట్ క్లబ్‌పై చర్యలు తీసుకోవాలి : గడ్డం శ్రీనివాస్ యాదవ్



విశ్వంభర, అబిడ్స్ : హైదరాబాద్ అబిడ్స్‌లోని 'ఇంటిమేట్ క్లబ్'లో నిబంధనలకు విరుద్ధంగా పేకాట, జూదం జరుగుతున్నట్లు ఆరోపిస్తూ దానిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాంపల్లిలోని మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఏడాది నుంచి క్లబ్ నిర్వహణపై తాను పోరాడుతున్నానని తెలిపారు. మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్ అధ్యక్షతన క్లబ్ కొనసాగుతోందని, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అండదండలు ఉన్నాయని ఆరోపించారు. క్లబ్ ద్వారా రోజుకు సుమారు రూ.లక్ష వసూళ్లు జరుగుతున్నాయని, నెలకు రూ.5 లక్షలు రాజాసింగ్‌కు వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలు సంబంధిత వ్యక్తుల నిర్ధారణకు లోబడి ఉంటాయి. ఒకవైపు ఆలయం, మరోవైపు పాఠశాల ఉన్న ప్రాంతంలో పేకాట క్లబ్ నిర్వహించడం వల్ల యువత, విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతోందని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తమ పిల్లలు పేకాటకు అలవాటుపడి కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పలువురు తల్లులు తనను కలిసి ఫిర్యాదు చేశారని తెలిపారు. క్లబ్‌కు ఉన్న అనుమతులు, లైసెన్సులపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్‌ను కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రామరాజు, జగదీష్, సంకీర్త్ పాల్గొన్నారు.

సాహిత్య, సంగీత రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తింపు



విశ్వంభర, హైదరాబాద్: సాహిత్య, సంగీత రంగాల్లో విశిష్ట సేవలందించిన టంగుటూరి వెంకట రామదాసుకు ప్రతిష్టాత్మక 'సాహిత్య సేవారత్న సన్మాన్' పురస్కారం లభించింది. భారత ప్రభుత్వం గుర్తింపు పొందిన సాహిత్య సేవా అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. 'మన హృదయాలను, ఆత్మను కాగితంపై పెట్టడం' అనే లక్ష్యంతో పనిచేస్తున్న కౌన్సిల్, సాహిత్య రంగానికి వెంకట రామదాసు అందించిన సేవలు, రచనల పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టంగుటూరి వెంకట రామదాసు మాట్లాడుతూ ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం తనకు, తన కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఈ గుర్తింపు మరింతగా సాహిత్య, సంగీత రంగాల్లో సేవ చేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌కు నెల్లికుదురు మోడల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక



విశ్వంభర, నెల్లికుదురు:: మహబూబాబాద్ లోని ఐడీఓసీ లో బుధవారం నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో నెల్లికుదురు పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా నుంచి రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌కు ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో నెల్లికుదురు మోడల్ స్కూల్‌కు చెందిన ఎస్. దీక్షిత్, సిరివెన్నెల ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. దీక్షిత్ ప్రధానమంత్రి పాత్రను, సిరివెన్నెల కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి పాత్రను పోషించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు మాట్లాడుతూ, జిల్లా నుంచి ఎంపికైన ఐదుగురిలో ఇద్దరు తమ పాఠశాల విద్యార్థులు కావడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయురాలు ఎం.ఏ. అంజుమ్ సుల్తానాను ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు అభినందించారు. సంబంధిత కార్యక్రమాలు విద్యార్థుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై అవగాహన, నాయకత్వ లక్షణాలు, చర్చా నైపుణ్యాలు, బాధ్యతా యుత పౌరసత్వ భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పాఠశాలలో ప్లే జోన్ ఏర్పాటు చేసిన పీఎన్ఆర్ ఫౌండేషన్



విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్లే జోన్ ఏర్పాటు చేశారు. పనుమటి నారాయణరెడ్డి 18వ వర్ధంతిని పురస్కరించుకొని ఫౌండేషన్ వ్యవస్థాపకులు పనుమటి మధుసూదన్‌రెడ్డి, పనుమటి నరేందర్‌రెడ్డి సుమారు రూ. 1.90 లక్షల వ్యయంతో ప్లే జోన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లే జోన్‌ను గ్రామ సర్పంచ్ పనుమటి మమత నరేందర్‌రెడ్డి, పనుమటి నారాయణరెడ్డి సతీమణి పనుమటి లక్ష్మమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలపై ఆసక్తి పెంచుకునేందుకు ప్లే జోన్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూప, ఉపసర్పంచ్ నారగొని అశోక్‌గౌడ్, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు, పీఎన్ఆర్ యువసేన కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నందుపల్లిలో ఉర్సు ఉత్సవాలు



విశ్వంభర, మహేశ్వరం: మహేశ్వరం మండలం నందుపల్లి గ్రామంలో ఈ నెల 2న సాయంత్రం 6 గంటలకు హజ్రత్ సయ్యద్ మహబూబ్ సుభాని రహమతుల్లా అలై ఉర్సు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాలకు మహేశ్వరం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా నందుపల్లి ఉపసర్పంచ్, ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేక్ ఎజాజ్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షుడు షేక్ హాజీబాబా, నందుపల్లి గ్రామ ముస్లిం సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజాపాషా, కోశాధికారి మహమ్మద్ ఖయ్యూంఖాన్, సభ్యుడు మహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.